నేరాల నియంత్రణే లక్ష్యంగా పని చేయాలి




వీసీలో పాల్గొన్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

- కేసుల దర్యాప్తు పురోగతిని మెరుగు పర్చాలి
- ప్రజల భద్రతతో పాటు, సైబర్ నేరాలను అరికట్టాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ శివధర్‌రెడ్డి

8

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

మహబూబాబాద్

శుక్రవారం 21 నవంబరు 2025



కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో వేలానికి పెట్టిన బాలసముద్రంలోని 2.27 ఎకరాల ప్రభుత్వ భూమి ఇదే..

'భూ'గోతం

ప్రభుత్వ భూముల వేలంపై వివాదం

- నగరం నడిబొడ్డున 2.27 ఎకరాల భూమి వేలానికి 'కుడా' ప్రకటన
- అభ్యంతరాలు, ఆరోపణలతో తాత్కాలికంగా వాయిదా
- గంపగుత్తగా వేలానికి సిద్ధం కావడంపై అనుమానాలు
- అధికార పార్టీ ప్రజాప్రతినిధుల బినామీలకు కట్టబెట్టేందుకేనని ప్రచారం
- ప్లాట్లు చేస్తే ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వస్తుంది కదా.. అని పలువురి వాదన
- కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు కోసమే టెండరంటున్న 'కుడా'
- ఐటీ టవర్, కమర్షియల్ కాంప్లెక్స్‌పై దృష్టి పెట్టాలంటున్న నగరవాసులు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

అభివృద్ధి పనులకు నిధులను సమకూర్చుకునేందుకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ప్రభుత్వ భూముల వేలానికి దిగింది. నగరం నడిబొడ్డున బాలసముద్రంలో ఉన్న 2.27 ఎకరాల భూమిని గంపగుత్తగా అమ్మకానికి పెట్టింది. అయితే ఈ విషయంలో అనేక అనుమానాలు, ఆరోపణలు వస్తున్నాయి. ప్లాట్లుగా విక్రయించకుండా.. ఏక మొత్తంలో భూమిని వేలం పెట్టడం వెనుక అధికారపార్టీ నేతల హస్తం ఉందనే ప్రచారం జరిగింది. వ్యాపారపరంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకే భూమిని వేలం పెట్టామని అధికారులు పేర్కొంటుండగా, క్రీడామైదానానికి కేటాయించిన భూమిని కుడా ఎలా అమ్ముకుంటారని ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ వివాదాల నేపథ్యంలో తాత్కాలికంగా వేలం వాయిదా వేసినప్పటికీ హాట్‌కేక్ లాంటి భూమిని అమ్మడం కంటే కుడానే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేసి, అద్దెలకు ఇస్తే ఆదాయం వస్తుంది కదా అనే చర్చ జరుగుతోంది.

ఆదాయం కోసం వేలం

ఆదాయం కోసం కుడా ప్రభుత్వ భూములను వెంచర్లుగా చేసి, ప్లాట్లు విక్రయిస్తోంది. నగరంలో ఓ సిటీ, మా సిటీ, యుని సిటీ పేర్లతో భారీగా ప్లాట్ల వ్యాపారం చేసింది. ఇటీవలకాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోవటంతో కుడా ప్లాట్లకు డిమాండ్ లేకుండా పోయింది. 117ఎకరాల్లో ఓ సిటీలో చేసిన ప్లాట్లు అనేకం ఇంకా అమ్ముడు పోవాల్సి ఉంది. పశ్చిమ, దక్షిణ ముఖం గల ప్లాట్లు కొనుగోలుకు ప్రజలు ఆసక్తిచూపక పోవటం ఈ ప్లాట్లు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయి. ఉనికిచర్ల సమీపంలో కుడా చేసిన వెంచర్‌ను స్పోర్ట్స్ స్కూల్ కోసం స్థల సేకరణ చేస్తున్నారు. ఈ క్రమంలో కుడా ఆదాయం పడిపోవటంతో అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడుతోంది. దీంతో హనుమకొండ నడిబొడ్డున బాలసముద్రంలోని సర్వే నెం.1066/5లో గల 2.27ఎకరాల (12,957గజాల) భూమిని వేలం ద్వారా విక్రయించేందుకు కుడా ఏర్పాట్లు చేసింది. హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌కు అతి సమీపంలో ఉండటంతో దీని ద్వారా సుమారు రూ.100 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనాతో గత అక్టోబరు 22వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. వాణిజ్య, (మిగతా 7లో..)



పల్లెల్లో.. పొలిటికల్ హీట్

'పంచాయతీ' ఎన్నికలకు సర్కారు సై

- తొలుత పార్టీ రహిత ఎన్నికలే
- ఓటర్ల జాబితా సవరణ షురూ
- షెడ్యూల్ విడుదల కావడమే తరువాయి



నడివాడ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న కార్యదర్శి ఉమారాణి



మహబూబాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో 'స్థానిక' పోరు షురూ కానుంది. చలికాలంలో పొలికల్ హీట్ పెరుగనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వివాదంలో తలదూర్చిన నేపథ్యంలో కోర్టు ఆంక్షలు, రాజకీయ ఎత్తుగడలు వెరసి పార్టీ రహిత పంచాయతీ ఎన్నికలకు 50 శాతం రిజర్వేషన్ మించకుండా ముందుకు వెళ్లేందుకు సర్కార్ సై అంటోంది. ఎట్టకేలకు నాలుగైదు రోజుల్లోనే పంచాయతీ షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశాలు ఉండడంతో పల్లెల్లో ఓటర్ల జాబితా సవరణ ఆరంభమైంది.

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గురువారం అన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణకు శ్రీకారం చుట్టారు. జాబితాలను ఆయా గ్రామపంచాయతీల్లో అందుబాటులో ఉంచి అభ్యంతరాల స్వీకరణ చేపట్టారు. శుక్రవారం ఓటరు దరఖాస్తుల అభ్యంతరాలు, పరిష్కారం చేపట్టి ఈ నెల 23న పంచాయతీ, వార్డుల వారీగా తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు. ఇప్పటికే గ్రామపంచాయతీ ఎన్నికల పరిశీలకులను ఎన్నికల కమిషన్ నియామకం చేసింది. మహబూబాబాద్ జిల్లాకు సాధారణ పరిశీలకుడిగా ఐఏఎస్ అధికారి మధుకర్‌బాబును కేటాయించింది. గ్రామపంచాయతీ ఎన్నికలను రెండు దశలోనే పూర్తిచేసే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 42 శాతం బీసీల రిజర్వేషన్ల కేటాయింపు సమయంలో మూడుదశల్లో పోలింగ్ ఉంటుందని పేర్కొన్నప్పటికీ ఈ సారి మారుతున్న పరిస్థితుల్లో రెండు దశల్లోనే ఎన్నికల నిర్వహణ ఉంటుందంటున్నారు.

మారిన పరిణామాల్లో ..

42 శాతం రిజర్వేషన్ల సందిగ్ధతపై మారిన పరిణామాలు ప్రభుత్వాన్ని గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ వైపు దృష్టిసారించేలా చేశాయి. గ్రామపంచాయతీలకు సంబంధించి ఎన్నికలు నిర్వహించకుంటే రాష్ట్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రూ.3 వేల కోట్లు వచ్చే పరిస్థితి ఉండదని భావించిన కాంగ్రెస్ సర్కార్ తొలుత పంచాయతీ ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆ నిధులను రాబట్టాలని నిర్ణయించిన విషయం విధితమే. తాజాగా, రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న ఈ చర్యలతో పల్లెల్లో పంచాయతీ హడావుడి మొదలైంది. 42 శాతం రిజర్వేషన్‌ను చట్టపరంగా సాధ్యపడకపోతే పార్టీపరంగా ఇచ్చే ఆలోచన చేస్తున్న కాంగ్రెస్ తొలుత పార్టీ రహిత (సింబల్ లేని) పంచాయతీ ఎన్నికలకు సిద్ధమైంది. దీనికనుగుణంగా అన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితా ప్రదర్శించింది.

పార్టీల హడావుడి, లాబీయింగ్..

తొలుత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారన్న ప్రభుత్వ సంకేతాలతో పల్లెల్లో పార్టీల హడావుడికి తోడు, స్థానిక నాయకుల లాబీయింగ్ మొదలైంది. పార్టీ సింబల్ రహిత పంచాయతీ ఎన్నికలు కావడంతో సాధ్యమైనంత వరకు అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్‌ఎస్ మద్దతు ద్వార పోటీ చేయాలని సర్పంచ్ అభ్యర్థులు మొదలుకుని వార్డు సభ్యులు ఎవరికి వారే తమ గ్రామ నాయకుల ద్వారా ప్రయత్నాలు ఆరంభించారు. కొందరైతే ఏకంగా మేజర్ పంచాయతీలను దక్కించుకునేందుకు స్వయాన ఎమ్మెల్యేల ఆశీస్సులు తీసుకుంటున్నారు.

మహబూబాబాద్ జిల్లాలో పూర్తిస్థాయి నియోజకవర్గాలుగా మహబూబాబాద్, (మిగతా 8లో..)

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర
- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



సోమ్లాతండాలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. సోమ్లాతండా, అయోధ్య, పర్వతగిరి, జంగిలిగొండ, వీఎస్ లక్ష్మీపురం గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నాలకు క్వింటాకు రూ.2,389తో పాటు బోనస్ రూ.500ల చొప్పున క్వింటాకు రూ.2,889 ధర వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, బాలాజీ, రాంచంద్రు, నలమాస సుధాకర్, నారాయణసింగ్, ఎంపీడీవో సుస్మిత, ఏవో తిరుపతిరెడ్డి, ఏపీఎం శంకర్, సీసీ సుమలత పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీది త్యాగాల చరిత్ర

- వామపక్షాలు, ప్రగతిశీల శక్తులు కలిసి పనిచేయాలి
- బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మానుకోటలో ప్రచార బస్సుజాతలో ప్రసంగిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నాటి దేశ స్వాతంత్ర్య పోరాటం నుంచి తెలంగాణ సాయుధ పోరాటం, నేటి ప్రజాసమస్యల పరిష్కారం కోసం జరిగిన అనేక పోరాటాల్లో ఆసువులు బాసిన త్యాగాల చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే వంద సంవత్సరాల సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని నవంబర్ 15న జోడేఘాట్‌లో ప్రారంభమైన బస్సుజాత గురువారం మానుకోటకు (మిగతా 8లో..)

పేదల పక్షపాతి ఎర్రజెండా..

- తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

పేదల పక్షాన పోరాడే సీపీఐ పేదల పక్షపాతి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సభకు 40 దేశాల నుంచి కమ్యూనిస్టు ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

23న ఎన్‌ఎంఎంఎస్ అర్హత పరీక్ష

- జిల్లాలో నాలుగు కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 866 మంది విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 23న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) అర్హత పరీక్ష జరుగుతుందని డీఈవో దక్షిణామూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతుందని వివరించారు. ఈ పరీక్షకు 866 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానుండగా, నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మానుకోట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, తొర్రూరులోని జడ్పీహెచ్‌ఎస్, సెయింట్ పాల్ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు తీసుకురావద్దన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ తీసుకురావాలని సూచించారు. వివరాలకు ఏసీజీఈ మందుల శ్రీరాములు సెల్ నెంబర్ : 9849761012ను సంప్రదించాలన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేయాలి

- వీసీలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ శ్రీరాణి కుముదిని

మహబూబాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరిచేసి, ఫైనల్ జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ శ్రీరాణి కుముదిని సూచించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు మకరంద్, స్రీజన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డితో కలిసి ఆమె.. కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో గురువారం వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 22న అభ్యంతరాల పరిష్కారం, 23న గ్రామపంచాయతీ వార్డు, డివిజన్‌ను సూచిస్తూ ఓటర్ల జాబితాను పునఃప్రచురించాలని సూచించారు. మారిన ఓటర్ల సంఖ్యను కలుపుకుని పోలింగ్ కేంద్రాలను పునఃప్రచురించాలని చెప్పారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పొ, కె.అనిల్ కుమార్, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, జిల్లా అధికారులు పురుషోత్తం, హరిప్రసాద్, కిరణ్‌కుమార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ నమోదు ప్రక్రియను పెంచాలి

అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ విద్యార్థుల ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ నమోదు ప్రక్రియను పెంచాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లాస్థాయి ఎస్సీ విద్యార్థుల ప్రీమెట్రిక్ నమోదు ప్రక్రియపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 5 నుంచి 8వ తరగతి చదువుతున్న బాలురకు సంవత్సరానికి రూ.1000, బాలికలకు రూ1500, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9,10 తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.3500, ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న హాస్టల్ విద్యార్థులకు రూ.7వేలు మంజూరు చేస్తామన్నారు. విద్యార్థులకు సంబంధించిన ఆధార్‌కార్డు, కుల, ఆదాయ, విద్యా ధ్రువపత్రాలతో పాటు పాస్ పోర్ట్‌సైజ్ ఫొటో, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లను అందించాలన్నారు. సమావేశంలో డీఈవో దక్షిణామూర్తి, జిల్లా అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

డీఈవో దక్షిణామూర్తి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దక్షిణామూర్తి

మహబూబాబాద్‌టౌన్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా నిలుస్తున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి అన్నారు. మహబూబాబాద్‌లో జిల్లా కేంద్ర గ్రంథాయలంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థి దశలో చదివే పుస్తకాలే జీవితంలో మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. అనంతరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య ట్రస్ట్ చైర్మన్ షేక్‌జానీ 6 కుర్చీలు, గ్రంథాలయ పాఠకుడు సాయికిరణ్ 3 కుర్చీలు, ప్రకాశ్ ఎలక్ట్రికల్ యాజమాని నాళ్ల వీరన్న 4 కుర్చీలు గ్రంథాలయానికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి.శ్రీలత, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, షేక్ జానీ, గూడ నరేందర్, జి.విజేందర్, రుద్రారపు వీరేందర్, భూలక్ష్మి, యాదమ్మ, అబ్బగాని భాస్కర్, జంపాల నారాయణ పాల్గొన్నారు.



ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ కేసులు పెరుగుతున్నాయి

- నిబంధనలు అతిక్రమిస్తే రిజిస్ట్రేషన్ రద్దు
- డీఎంహెచ్‌వో భూక్య రవిరాథోడ్

8

మానుకోటలో ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న రవిరాథోడ్

నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం గొల్లచర్ల క్రాస్‌రోడ్డు వద్ద గురువారం ఆటోలో తరలిస్తున్న నల్లబెల్లంతో పాటు పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఖాదర్ పాషా తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ వద్ద నుంచి ఆటోలో కొందరు వ్యక్తులు బెల్లం తరలిస్తున్నారు. అదే సమయంలో డోర్నకల్ మండలం గొల్లచర్ల క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సై ఖాదర్‌పాషా తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా అటుగా వచ్చిన ఆటో అనుమానాస్పదంగా కన్పించడంతో తనిఖీ చేశారు. ఆటోలో 7 బస్తాల బెల్లంతో పాటు ఓ బస్తాలో పటిక ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేశారు. ఇందుకు కారకులైన కేసముద్రంకు చెందిన బాదావత్ సురేష్, మానుకోటకు చెందిన జ్యోతిబసునగర్‌కు చెందిన నిజ్జుతో పాటు ఇనుగుర్తి మండలం కోమటిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ సంతోష్ ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

తొర్రూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు పెద్ద చెరువు వద్ద చేపడుతున్న మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను వరంగల్ ఎంపీ కడియం కావ్యతో కలిసి పరిశీలించి వారు మాట్లాడుతూ పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొర్రూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని, ప్రజల ఆహ్లాదం కోసం రూ.5కోట్లతో మినీ ట్యాంక్ బండ్ పనులను ప్రారంభించామన్నారు. చెరువు కట్ట రేలింగ్, ఇతర పనులు పూర్తికావచ్చాయని, మరి కొన్ని పురోగతిలో ఉన్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. పట్టణ అభివృద్ధి కోసం అన్ని విధాల సహకరిస్తానని, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను మునిసిపాలిటీకి కేటాయిస్తానని కడియం కావ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, పెదగాని సోమయ్య, సోమ రాజశేఖర్, ప్రవీణ్‌యాదవ్, రవి, విజయ్ పాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రాజేశ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెరువు వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఎంపీ కడియం కావ్య

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు బయ్యారం విద్యార్థుల ఎంపిక

బయ్యారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నల్గొండలో శుక్రవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు బయ్యారం బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు సాయి కుమార్, చరణ్ ఎంపికైనట్లు హెచ్ఎం, ఎంఈవో దేవేంద్రాచారి గురువారం పేర్కొన్నారు. కాగా, రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఇరువురు విద్యార్థులు ఎంపికవడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : నర్సింహులపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జనవ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మహిపాల్‌రెడ్డి, భూక్య నాగేష్, కొండ సంజీవ గురువారం తెలిపారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీడీవో ఏలూరి అంజలి, ఎంఈవో రామ్మోహన్‌రావు, ఎస్సై సురేష్, జేవీవీ గౌవ అధ్యక్షుడు ఎర్ర పూర్ణచందర్ పాల్గొననున్నట్లు తెలిపారు.

విద్యార్థులే సమాజ నిర్మాతలు

డీఈవో దక్షిణామూర్తి

కురవి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులే సమాజ నిర్మాతలని డీఈవో దక్షిణామూర్తి అన్నారు. మోదుగులగూడెం జడ్పీఎస్ఎస్‌లో గురువారం పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు బొల్లం శ్రీనివాస్ ఆల్ఇన్‌వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు సమయస్ఫూర్తితో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులు విద్యావంతులయితే ఆ సమాజం సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, దాత బొల్లం శ్రీనివాస్, బలాష్టి రమేష్, షైన శ్రీనివాస్, చుంచు శ్రీశైలం, లత, ఇందిరా, దీపిక, రజిత, రచ్చ వెంకన్న, రమేష్, విజయ్, సునీల్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



మోదుగులగూడెంలో మాట్లాడుతున్న దక్షిణామూర్తి

'సొసైటీని అభాసుపాలు చేయొద్దు..'

● పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి ● కోర్టు తీర్పుతో చైర్మన్‌గా తిరిగి బాధ్యతలు

బయ్యారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బయ్యారం ప్రాథమిక సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) సొసైటీని అభాసుపాలు చేస్తూ, రైతులకు నష్టం చేకూర్చే కుట్రలకు పాల్పడొద్దని ఆ సంఘ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి ప్రతిపక్ష నేతలతో పాటు స్వపక్ష వర్గ నేతలకు సూచించారు. కోర్టు తీర్పు నేపథ్యంలో గురువారం ఆయన తిరిగి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులపై కొంతమంది తప్పుడు ఆరోపణలు చేస్తూ సొసైటీపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తమ పరిధిలో సొసైటీ నిధులు దుర్వినియోగం కాలేదని, ఎక్కడా అవినీతి జరగలేదని, చైర్మన్‌గా ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. కానీ, కొంతమంది పనికట్టుకొని సొసైటీని బదనాం చేసే విధంగా తప్పుడు ఆరోపణలకు పాల్పడుతుండటంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవుపలికారు. లేని పక్షంలో తప్పుడు ఆరోపణలకు పాల్పడితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, వెంకటపతి, సుధాకర్‌నాయక్, రమేష్‌నాయక్, గణేష్, నర్సయ్య, నాగమణి, వెంకటనర్సమ్మ, రామనాథం తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ చైర్మన్‌గా తిరిగి బాధ్యతలు చేపడుతున్న మధుకర్‌రెడ్డి

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆకేరు వాగు నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రమేశ్‌బాబు అన్నారు. ఇసుక అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా కౌసల్యదేవిపల్లి గ్రామ సమీపంలో ఇసుక ర్యాంపులకు ఎక్స్‌కావేటర్ సహాయంతో ట్రెంచ్ కటింగ్ చేయించారు. రాత్రి, పగలు అనుమతులు లేకుండ ఇసుక తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి, ట్రాక్టర్ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు..



కౌసల్యదేవిపల్లి వద్ద ఇసుక ర్యాంపునకు ట్రెంచ్ కొడుతున్న దృశ్యం

కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి

దంతాలపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపోణి, తూర్పుతండా, ఆగపేట, లక్ష్మీపురం గ్రామంలో గురువారం కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచుకోవాలని వ్యవసాయాధికారి వాహిని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పత్తి విక్రయంకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం కిసాన్ కపాస్ యాప్‌ను అమలులోకి తెచ్చిందన్నారు. రైతులు తమ మొబైల్ ద్వారా యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోని మిల్లుల వద్దకు తీసుకోరావాలన్నారు. తద్వారా సరైన రైతులకు ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు మధ్య దళారులకు విక్రయించకుండా నేరుగా యాప్ ద్వారా మాత్రమే పత్తి విక్రయం చేసుకోవాలన్నారు. ఏఈవోలు దిక్షిత్‌కుమార్, ఉదయ్ కిరణ్, శిరీష పాల్గొన్నారు.



కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

తొర్రూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కార్మిక హక్కుల పరిరక్షణకు సమరశీల పోరాటాలు చేస్తున్న సీఐటీయూ జిల్లా 4వ మహాసభలు జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. గురువారం తొర్రూరులో నిర్వహించిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో సామాజిక న్యాయం, సమానత్వం, శ్రమకు తగిన గౌరవం లాంటి అంశాలకు విరుద్ధంగా నూతన కార్మిక విధానాన్ని ప్రకటించిందని విమర్శించారు. ఈ నెల 28, 29 తేదీల్లో మరిపెడ పట్టణ కేంద్రంలో సీఐటీయూ జిల్లా 4వ మహాసభలు జరుగుతాయని, ఈ సభలకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు వీరన్న, శ్రీను, అశోక్, యాకయ్య, నాగరాజు, మహేష్, రవి, శారద ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

ఇళ్ల పంపిణీ చేపట్టేదాక ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తొర్రూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిర్మించి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీ చేపట్టేంత వరకు ఆందోళనలు కొనసాగుతాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అలువాల వీరయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.ఉపేందర్ అన్నారు. గత వారం రోజులుగా తొర్రూరులో కొనసాగుతున్న దీక్షలకు గురు వారం మద్దతు తెలిపి వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పాటుపడుతుందని తెలిపి 7 నెలలుగా ఇళ్ల కోసం దీక్షలు చేస్తున్న మహిళలను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఇండ్ల పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లం అశోక్, యాకూబ్, యాకయ్య, శ్రీను, మమత, రవి, వీరన్న, దర్గయ్య, లబ్ధిదారులు ఉన్నారు.

ముగిసిన గిరిజన గురుకులాల జోనల్ క్రీడలు



విజేత జట్లకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ జనార్దన్

ఏటూరునాగారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాల గిరిజన గురుకులాల విద్యార్థులకు ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి ట్రైబల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌మీట్ గురువారం ముగిసింది. కొమురంభీం మినీ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన ఈ క్రీడా పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ముగింపు కార్యక్రమానికి ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దబ్బాగట్ల జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. క్రీడాకారులు ఓటమిని కూడా స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ క్రీడా పోటీల ఫైనల్స్ కబడ్డీలో అండర్-14 విభాగంలో ప్రథమ స్థానంలో భూపాలపల్లి బాలికలు నిలవగా, ములుగు ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-14 బాలురు విభాగంలో కొత్తగూడ ప్రథమ స్థానం, ఏటూరునాగారం ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-17 బాలికల విభాగంలో ములుగు ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో మహబూబాబాద్ నిలిచింది. అండర్-17 బాలుర విభాగంలో ఏటూరునాగారం ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో హనుమకొండలో నిలిచింది.

ఖో-ఖోలో..

అండర్-14 బాలికల విభాగంలో ములుగు ప్రథమ స్థానంలో నిలువగా, ద్వితీయ స్థానంలో భూపాలపల్లి టీమ్ నిలిచింది. అండర్-14 బాలుర విభాగంలో ప్రథమ స్థానం ఏటూరునాగారం, ద్వితీయ స్థానంలో కొత్తగూడ నిలిచింది. అండర్-17 బాలికల విభాగంలో ప్రథమ స్థానం ములుగు, ద్వితీయ స్థానంలో కొత్తగూడ నిలిచింది. అండర్-17 బాలుర విభాగంలో ప్రథమ స్థానం ఏటూరునాగారం, ద్వితీయ స్థానంలో కొత్తగూడ నిలిచింది.

టెన్నికాయిట్‌లో..

అండర్-14 బాలికల విభాగంలో భూపాలపల్లి ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో వాజేడు నిలిచింది. అండర్-17 బాలికల విభాగంలో కొత్తగూడ ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో ములుగు నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ క్రీడల్లో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

దంతాలపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలో పని చేసే కార్యదర్శులు రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో విజయ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఇటీవల ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారితో సమావేశం అయ్యారు. ప్రభుత్వం రూ.5 లక్షలు ఆర్థిక సాయం ఇస్తుందన్నారు. పనులను సత్వరమే చేపట్టి లబ్ధిపొందాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు రానున్న సర్పంచ్, పరిషత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో వార్డుల వారీగా ఓటరు జాబితను సిద్ధంచేసి జీపీలో బోర్డును ప్రదర్శించామన్నారు. ప్రజలు తమ ఓటు హక్కు లిస్టును చూసుకోవాలని సూచించారు. కార్యదర్శులు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి కనీస సౌకర్యాలను గుర్తించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం



ఆలయంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మరిపెడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస అమావాస్యను పురస్కరించుకొని మరిపెడ బంగ్లాలోని సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆ ఆలయ అర్చకులు రవీంద్రాచారి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపి భక్తులకు అన్నదానం చేశారు. సాయిబాబాకు పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ఆ ఆలయ నిర్వాహకులు పేదలకు మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్తలు వెంపటి లక్ష్మీనారాయణ, ఇరుకుల శ్రీనివాస్, బూర్గుల దిలీఫ్ తదితరులు ఉన్నారు.

నాసిరకం చేప పిల్లల పంపిణీ

ఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మత్స్యశాఖ కుటుంబాలను బలోపేతం చేయడం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి చేపడుతున్న చేప పిల్లల పంపిణీలో అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై నాసి రకం చేప పిల్లలను తీసువచ్చారని మత్స్యశాఖ చైర్మన్ గుండెబోయిన భిక్షపతి అన్నారు. గురువారం ఆత్మకూరు మండలంలోని పెద్ద చెరువులో పోసేందుకు తీసుకవచ్చిన లారీలలో ఉన్న చేప పిల్లలు ప్రభుత్వం నిబంధనల ప్రకారం నాలుగు ఇంచుల 8 అంగుళాలు ఉండాలి కానీ.. అధికారులు, కాంట్రాక్టరు కుమ్మక్కై నాసిరకం చిన్న చేప పిల్లలను తీసుకువచ్చారని, వాటిని తిరిగి పంపించామని భిక్షపతి తెలిపారు. అధికారులు వెంటనే నాణ్యమైన చేప పిల్లలను తీసుకువచ్చి చెరువుల్లో పోయాలని, లేకుంటే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మరిపెడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ గురువారం పరామర్శించారు. మరిపెడ మునిసిపాలిటీకి చెందిన జొన్నలగడ్డ నాగరాజు గత కొద్ది రోజుల కిందట మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న రెడ్యానాయక్ బాధిత కుటుంబ సభ్యులను కలుసుకొని ఓదార్చారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు లతీఫ్, బోర మల్లయ్య తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి రెడ్యానాయక్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సత్వరమే చేపట్టాలి

దంతాలపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గృహ నిర్మాణానికి ఆర్థికసాయంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుండడంతో, మంజూరైన లబ్ధిదారులు పనులను వెంటనే ప్రారంభించాలని హౌసింగ్ ఏఈ హేమ అన్నారు. గురువారం ఆమె నేతృత్వంలోని బృందం మండలంలోని తూర్పుతండా, మేగ్యాతండా, రేక్యాతండాలో నిర్మాణంలో ఉన్న గృహాలు, నాన్‌స్టార్టెడ్ హౌస్ లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టాలన్నారు. ప్రభుత్వం అందించే రూ.5లక్షలు నాలుగు దఫాలు సకాలంలో పొందాలన్నారు. పేదల కోసం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఈ పథకంపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నామన్నారు. నిలిచిపోయిన ఇళ్లను పునరుద్ధరించేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న వాటికి వారంలోగా బిల్లులు అందిస్తున్నామన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమతశ్రీ, భద్రనాయక్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఒత్తిడిని జయించి ఉత్తమ ఫలితాలు సాధించాలి

పెద్దవంగర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఒత్తిడిని జయించి ఉత్తమ ఫలితాలు సాధించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస సూచించారు. గురువారం మండలంలోని చిన్నవంగర గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో మానసిక ఒత్తిడి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలలో భయాన్ని వీడి, లక్ష్యం వైపు దృష్టి సారిస్తే వంద శాతం ఫలితాలు సాధించవచ్చని అన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడి జయించాలంటే యోగా, ధ్యానంతో పాటు పౌష్టికాహకారం తీసుకోవాలన్నారు. విద్యార్థులందరూ బాగా చదివి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు ముఖ్యంగా విద్యాభ్యాసంతో పాటు జీవిత విలువను తెలుసుకోవాలని, వాటికి అనుగుణంగా సమాజంలో నడవడికతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, రమేశ్, రామ్మోహన్, రవి, శ్రీను, నరసింహారావు, వెంకటేశ్వర్లు, సింహాద్రి, నరసయ్య, మహబుబ్ అలీ, సోమయ్య, రామతార తదితరులు పాల్గొన్నారు



కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస

పదో తరగతిలో మంచి గ్రేడ్‌లు సాధించాలి

తొర్రూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదివే విద్యార్థులు రానున్న పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆర్డీవో కార్యాలయ ఏవో అనిల్‌కుమార్ అన్నారు. గురువారం తొర్రూరులోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలను అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేసి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించే విధంగా బోధన చేపట్టాలని, నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. ఉపాధ్యాయులు స్థానికంగా ఉండి విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయరత్నమాల, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సీఎం కృషితో ప్రత్యేక నిధులు

» రూ.18 కోట్ల నిధులతో 6 వంతెనలకు శంకుస్థాపన
» వరంగల్ ఎంపీ కడియం కావ్య



వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కావ్య తదితరులు

తొర్రూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషితో కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. పీఎంజీఎస్‌వై పథకం ద్వారా మంజూరైన నిధులతో గురువారం తొర్రూరు మండలం చెర్లపాలెం, కంఠాయపాలెం గ్రామాల్లోని వంతెనల నిర్మాణాల కోసం స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో కలిసి ఎంపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొర్రూరు మండలంలోని 2 ప్యాకేజీల కింద రూ.18 కోట్ల 39 లక్షలతో చెర్లపాలెం, కంఠాయపాలెం, హరిపిరాల, మడిపల్లి గ్రామాల్లో 5 వంతెనలు, పెద్దవంగర మండలంలో ఒక వంతెన నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికలతో కారు షెడ్‌కు వెళ్లిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, యూత్ మండల ప్రెసిడెంట్ పయ్యావుల ప్రవీణ్ యాదవ్, రాజేశ్ యాదవ్, నాయకులు దేవేందర్ రెడ్డి, యాకూబ్ రెడ్డి, ఎన్నమాల శ్రీనివాస్, వాసురెడ్డి, ముద్దం విక్రమ్‌రెడ్డి, సధాకర్, పీఆర్ ఈఈ విద్యాసాగర్, డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీటీ నర్సయ్య, ఏఈ నరేష్ రెడ్డి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపివేయాలి

» ఎన్‌కౌంటర్లపై కేసు నమోదు చేయాలి
» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

జనగామ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తోందని, వీటిని న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మావోయిస్టు అగ్ర నేత హిడ్మా లొంగి పోతారని ప్రచారం జరిగినా, హిడ్మా, అతడి భార్య, మరో ఆరుగురు మావోయిస్టులను నిర్బంధించి చంపారని ఆరోపించారు. నిజంగా ఎన్‌కౌంటర్ జరిగితే ఒక్క పోలీసుకూ గాయాలు ఎందుకు కాలేదని ప్రశ్నించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మావోయిస్టులను వచ్చే మార్చి లోపు ఏరి వేస్తామని ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఒక వ్యక్తిని చంపే అధికారం ప్రభుత్వానికి కానీ, పోలీసులకు లేదన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చాక జడ్జి తీర్పు ఇచ్చిన తర్వాతే నేరస్థుడిని శిక్షించాలన్నారు. పోలీసులు నిర్బంధించిన మరికొంత మంది మావోయిస్టుల అగ్ర నాయకులను కోర్టు ముందు హాజరు పర్చాలని డిమాండ్ చేశారు. హిట్లర్‌లాంటి వాళ్లనే మట్టి కరిపించిన చరిత్ర ఎర్రజెండాకు ఉందన్నారు. పార్లమెంట్‌లో బలం ఉందని మేము ఏది చేసినా నడుస్తుందని విర్రవీగిన వారందరూ చరిత్రలో మట్టిలో కలిసిపోయారని పీఎం నరేంద్రమోదీకీ అదే గతి పడుతుందని హెచ్చరించారు.

అవి ప్రభుత్వ హత్యలే..

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు రోజురోజుకు పెరిగి పోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. పత్తి కొనుగోలుకు ఆంక్షలు పెట్టి రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కిసాన్ కపాస్ యాప్‌తో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వెంటనే ఆ యాప్‌ను ఎత్తి వేయాలన్నారు. 12 శాతం పైగా తేమ ఉన్నా పత్తిని కొనుగోలు చేయాలని, రంగుమారిన పత్తిని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఆత్మహత్య చేసుకోవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

నారు దశ.. జాగ్రత్తలే రక్ష



» శీతాకాలంలో నారు మడులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
» రాత్రిపూట నీరు తీసి, ఉదయం నింపాలి
» యాజమాన్య పద్ధతులు పాటించాలి

వర్ధన్నపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రైతులు వరి నారు మడ్లు తయారు చేస్తున్నారు. వరి పంట సాగులో భాగంగా నారుమడి తయారు చేయు రైతులు శీతకాలం దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా రాత్రి, ఉదయం సమయాల్లో ఉష్ణోగ్రత తీవ్రత పూర్తిగా పడిపోతుంది. అందువల్ల నారు మడిలో నీరును మారుస్తూ నీటి యాజమాన్యం పాటించాలి. దీంతో చలి నుంచి నారుమడిని కాపాడుకోవచ్చు. నారు ఆరోగ్యంగా పెరిగితేనే పంట దిగుబడి అధికంగా వస్తుంది. అందువల్ల నారుమడ్ల యాజమాన్య పద్ధతులు పాటించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎకరానికి 30 నుంచి 35 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బెండిజమ్‌తో విత్తన శుద్ధిచేయాలి. దీంతో విత్తనం ద్వారా వ్యాపించే తెగుళ్లను అరికట్టవచ్చు. నిద్రావ్యవస్థలో ఉన్న విత్తనాలను మేలుకొల్పడానికి 1 కిలో విత్తనానికి 10మిల్లీ లీటర్ల నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టాలి. పశువుల పేడ గాని, సేంద్రియ ఎరువును ఎకర నారుమడికి 100 నుంచి 200 కిలోల నత్రజనిని, కిలో పోటాషియంను చల్లాలి. విత్త నాలు విత్తిన 15 రోజులకు 2 కిలోల భాస్వరం వేసుకోవాలి.

మండలంలో నారుమడ్ల తయారీలో ఉన్న రైతులకు ఈ శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

నారు మడి తయారీ

రెండు గుంటల నారుమడికి 2 క్వింటాళ్ల కోళ్ల ఎరువు లేదా గొర్రెల ఎరువు లేదా వర్మీ కంపోస్టును వేసి కలియదున్నాలి. ఈ సేంద్రియ ఎరువులను నారుమడుల్లో వాడటం వల్ల చలి తీవ్రతలో కూడా నారుకు పోషకాలు అంది ఎదుగుదలకు తోడ్పడుతుంది. లేదంటే రెండు గుంటల నారుమడికి 2కిలోల నత్రజని, 2 కిలోల భాస్వరం, 1కిలో పోటాష్‌ను వేయాలి.

యాసంగిలో వరి పంట వేయాలనుకునే రైతులు స్వల్ప కాలిక రకాలను ఎంచుకోవడం ఉత్తమం. ఎందుకంటే నీటి లభ్యత పంట కాలం ఎక్కువైతే సమస్యలు ఎదురవుతాయి. అదే విధంగా వడగండ్లు, తదితర విపత్తులు సంభవించే ఆవకాశం ఉంటుంది.

చలితో జింక్ లోపం

చలి అధికమైనప్పుడు జింక్ లోపం వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల నారుమడిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌కు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మొలకట్టిన విత్తనాన్ని నారుమడిలో మొదటి వారం రోజుల పాటుగా తక్కువగా ఉంచాలి. రాత్రి ఉష్ణోగ్రత్తలు 12 డిగ్రీలకు కంటే తక్కువగా ఉన్నప్పుడు నారు ఎదుగదు. కొన్ని సార్లు వరి చనిపోతుంది. దీని కోసం రసాయన ఎరువులను వినియోగించాలి. చలి సమస్యను అధిగమించడానికి వరిమడ్లపై టార్పాలిన్‌లు రాత్రి పూట ఉంచి, ఉదయం పూట తీసి వేయాలి. రాత్రి పూట వరి మడి నుంచి పూర్తిగా నీరు తీసివేసి, ఉదయం పూట తాజా నీటిని నింపాలి. దీంతో వరి ఎదుగుదలలో లోపం లేకుండా ఉంటుంది. కాండం తొలిచే పురుగు (మొగ్గ పురుగు) నుంచి పంటను కాపాడుకోవడానికి నారు తలలు తుంచి నాటు వేసుకోవాలి. దీంతో కాండం తొలిచే పురుగు నారు కొనలపై గుడ్లు పోదుగుతుంది. దిని వల్ల గుడ్లతో పాటుగా మొగ్గపురుగును నివారించవచ్చును. నారు తీసే వారం రోజుల ముందు ఎకరా నారుమడికి 1 కిలో కార్బోఫ్యూరో త్రీజీ లేదా కార్టప్ హైడ్రో క్లోరైడ్ పోర్‌జీ గుళికలను వేసేకున్నట్లయితే నాటు వేసిన నెల రోజుల వరకు ఎలాంటి కీటకాలు ఆశించకుండా పంటను రక్షించుకోవచ్చు.

అధికారుల సలహాలు పాటించాలి

విజయ్‌కుమార్, ఏవో

ప్రస్తుతం ఉన్న వాతావరణం పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నారుమడుల్లో సాయంత్రం వేసిన నీటిని ఉదయం తొలగించాలి. చలి తీవ్రత నుంచి నారుమడిని కాపాడుకోవడానికి వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుంటే మంచిది. నారుమడికి కావాల్సిన వెచ్చదనం అందించే ఎరువులను వాడుకుంటే ఫలితం.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

బీసీ రిజర్వేషన్లపై

బీజేపీ, బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి లేదు

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వరంగల్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆరోపించారు. గురువారం వరంగల్‌లోని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ నివాసంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు నియోజకవర్గం నుంచి పూర్తి మద్దతు తెలుపుతూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. యువ నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న సందర్భంగా బడుగు బలహీన వర్గాలను కలిసినప్పుడు రాజకీయంగా, ఆర్థికంగా అట్టడుగున ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. వారికి న్యాయం జరగాలంటే బీసీలకు జనాభా పరంగా రావాల్సిన వాటా వచ్చినప్పుడే వారు అభివృద్ధి చెందుతారనే అభిప్రాయానికి వచ్చారని అన్నారు. దీంతో బీసీకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కేటాయించి అమలు చేయాలని సంకల్పించారని తెలిపారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి రెడ్డి కులానికి చెందిన వారైనప్పటికీ కులగణన చేపట్టి జనాభా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని నిశ్చయించారని సారయ్య అన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో శాసనసభలో, శాసన మండలిలో చర్చ చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపించారన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ మాత్రం బీసీ రిజర్వేషన్లకు సహకరించడం లేదని చెప్పారు. ఇప్పటికీ బీసీలలో కొన్ని కులాల వారు కనీసం వార్డు సభ్యుడిగా కూడా ఎన్నిక కాని పరిస్థితి నెలకొందన్నారు.

కార్పొరేటర్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్లపై నోటితో రిజర్వేషన్లు కావాలే.. నొసటితో రిజర్వేషన్లు అక్కరలేదన్నట్లు బీజేపీ వ్యవహరిస్తుందన్నారు. ఇది ద్వంద్వ వైఖరి అన్నారు. సమావేశంలో నాయకులు బస్వరాజు శ్రీమాన్, గోరంటాల రాజు, కరాటే ప్రభాకర్, బిల్ల శ్రీకాంత్, దూపం సంపత్, కూరతోట సదానందం, బొలుగొడ్డు శ్రీను, రాముల బాబు, బైరబోయిన చంద్రమౌళి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం తగదు

పీఏసీఎస్ అధికారులపై
కలెక్టర్ స్నేహ శబరీష్ ఫైర్



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హసన్‌పర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పీఏసీఎస్ అధికారులపై హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని జయగిరి గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో నిర్వాహకులు, అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎంత మంది రైతుల వద్ద ఎంత ధాన్యం కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధిత నిర్వాహకులు ఇప్పటి వరకు 29 మంది రైతుల వద్ద 1032.20 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీరిలో ఎంతమందికి పేమెంట్ అయ్యిందని కలెక్టర్ అధికారులను ప్రశ్నించడంతో పాటు, ఇప్పటి వరకు 29 మంది రైతులకు సంబంధించిన పేమెంట్ ఎందుకు జనరేట్ చేయలేదని, ట్రక్ షీట్‌లో మాయిశ్చర్ నమోదు చేయకుండా ఎందుకు మిల్లులకు తరలిస్తున్నారని మండిపడ్డారు.

ఆన్‌లైన్ సమస్య ఉందని చెప్పడంతో కలెక్టర్ మరింత సీరియస్ అయ్యారు. ట్రక్ షీట్‌తో పాటు మాయిశ్చర్ నమోదు చేయకుండా ఆన్‌లైన్ పేమెంట్ చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరి కాదని పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డితో పాటు వ్యవసాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడే ఇన్న మహిళా రైతు అరుణ పేమెంట్‌ను కలెక్టర్ స్వయంగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలులో నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేస్తే టోల్ ఫ్రీ నెంబర్‌కు గానీ లేదా స్వయంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ వెంట ఏడీఏ ఆదిరెడ్డి, తహసీల్దారు పూజారి కిరణ్‌కుమార్, ఎండీవో సుమనవాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్, ఏఈవోలు సుమన్, భాస్కర్, పీఏసీఎస్ హసన్‌పర్తి సీఈవో శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లయీస్ అధికారులు, మార్కెట్ డైరెక్టర్ పల్లె దయాకర్ రైతులు పాల్గొన్నారు.

'భూ'గోతం

(5వ పేజీ తరువాయి)

షాపింగ్ మాల్స్, హోటల్స్, హస్పిటల్స్, విద్యా సంస్థలకు, ఐటీ కంపెనీ కార్యాలయాలకు అనుగుణంగా ఉంటుందని, ఏక మొత్తంలో 2.27ఎకరాల భూమిని వేలం పెట్టింది. తొలుత నవంబరు 3వ తేదీన ఆక్షన్ తేదీని ప్రకటించింది. అయితే నగరంలో వరదలు రావటంతో 14వ తేదీకి వాయిదా వేశారు. హాట్‌కేక్‌లాంటి భూమిని గంపగుత్తగా అమ్మకానికి పెట్టడంపై విమర్శలు రావటంతో పాటు క్రీడా స్థలాన్ని ఎలా విక్రయిస్తారని టీడీపీతో పాటు కమ్యూనిస్టు పార్టీలు అభ్యంతరం చెప్పటంతో వేలం తాత్కాలికంగా వాయిదా వేశారు.

హస్తం నేతల నజర్ ?

నగరంలో వివిధ అభివృద్ధి పనులకు, నిర్మాణాలకు స్థలం కొరత ఉంది. అనువైన స్థలం లేకపోవటంతో నగరానికి దూరంగా నిర్మాణాలు చేయాల్సి వస్తోంది. అయితే ఉమ్మడి జిల్లా ప్రజలు వినియోగించుకునే హనుమకొండ బస్టాండ్‌తో పాటు స్టేడియానికి అతి సమీపంలో ఉన్న ఈ భూమి వేలంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2.27ఎకరాల భూమిని ఏక మొత్తంలో వేలం వేయటం దేనికనే ప్రశ్నలు వస్తున్నాయి. వెంచర్ చేస్తే 50 వరకు ప్లాట్లు వస్తాయని, దీనితో ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పట్టణ నడిబొడ్డున మరో కాలనీ ఏర్పడుతుందనే వాదన ఉంది. అలా కాకుండా ఏకమొత్తంలో 2.27ఎకరాల భూమిని వ్యాపారవర్గాల కోసం వేలం వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ వేలం వెనుక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధుల బినామీల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ప్రజాప్రతినిధి తన బినామీ కంపెనీకి కట్టబెట్టేందుకు వేలం వేయిస్తున్నారనే చర్చ జరుగుతోంది.

మరోవైపు ఈ భూమిని క్రీడామైదానం, క్రీడల అభివృద్ధి కోసం గతంలో ప్రణయ్‌భాస్కర్ మంత్రిగా ఉన్నప్పుడు 3వేల గజాల స్థలాన్ని కేటాయించారని టీడీపీ నేతలు పేర్కొంటున్నారు. బాలసముద్రం భూముల వేలాన్ని నిలిపివేయాలని కుడా కార్యాలయం ఎదుట టీడీపీ నేతలు ధర్నా నిర్వహించి, చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్‌కి వినతి పత్రాన్ని అందించారు. బీఆర్ఎస్‌తో పాటు కమ్యూనిస్టులు కూడా బాలసముద్రం భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీంతో భూముల అమ్మకం తాత్కాలికంగా వాయిదా వేశారు.

అయితే ఈ విమర్శలను అధికార పార్టీ నేతలు, కుడా అధికారులు మాత్రం తిప్పికొడుతున్నారు. నగరం వ్యాపారంగా అభివృద్ధి చేసేందుకే వేలం వేస్తున్నట్లుగా చెపుతున్నారు. 2.27ఎకరాల భూమి ఒకే కంపెనీకి దక్కితే.. ఏదైనా షాపింగ్ మాల్, ఐటీ కంపెనీ లేదా విద్యాసంస్థలు వచ్చే అవకాశం ఉంటుందని, ఆ ఉద్దేశంతోనే ఏకమొత్తంలో భూమిని వేలం వేస్తున్నామని చెపుతున్నారు. ప్లాట్లుగా విభజిస్తే చాలా వరకు భూమిని కోల్పోవాల్సి వస్తుందంటున్నారు. పక్కనే నాలా ఉండటం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇతరత్రా అవాంతరాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. కమర్షియల్ స్థలం కావటంతోనే ఏకమొత్తంగా భూమిని వేలం వేస్తున్నామని అంటున్నారు.

కమర్షియల్ కాంప్లెక్స్.. ఐటీ టవర్..

హైదరాబాద్ తరువాత రెండో రాజధానిగా ప్రభుత్వం వరంగల్‌ను అభివృద్ధి చేస్తోంది. నగరం నడిబొడ్డున ఉన్న స్థలాన్ని అమ్మకానికి పెట్టే బదులు కుడా నిధులతో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తే.. అద్దె ద్వారా ఆదాయం వస్తుందనే వాదన వినిపిస్తోంది. అడ్వాన్స్‌లు, అద్దెలతో భూమిని విక్రయించిన దానికంటే అధికంగా ఆదాయం వస్తుందనే చర్చ జరుగుతోంది. ఇది సాధ్యం కాకుంటే ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న నగరంలో ఐటీ అభివృద్ధి కావటం లేదు. దీంతో ఈ స్థలంలో ఐటీ టవర్ నిర్మాణం చేస్తే కొన్ని కంపెనీలు వచ్చే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. నగర శివారులో ఉన్న మడికొండలో ఐటీ అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతున్నాయనే ప్రచారం ఉంది. ఇప్పటికే రైల్వేలైన్ ఉండటంతో పాటుగా ఎయిర్‌పోర్టు కూడా వస్తుండటంతో వరంగల్‌లో ఐటీ అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో హాట్‌కేక్ లాంటి బాలసముద్రం భూములను నగర అభివృద్ధికి, వ్యాపారాభివృద్ధికి వినియోగిస్తే బాగుంటుందని అంటున్నారు.

బెంబేలెత్తిస్తున్న చలి



● శీతల గాలులతో జనం ఉక్కిరిబిక్కిరి
● అలసత్వం వహిస్తే పొంచి ఉన్న ప్రమాదం

వరంగల్ మెడికల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చలి రోజు రోజుకూ పెరుగుతోంది. రాత్రి పూట విపరీతంగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. నాలుగు రోజుల నుంచి పగటిపూట కూడా అత్యల్పంగా 20 నుంచి 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వచ్చే రోజుల్లో గాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున వాతావరణ మార్పుల నేపథ్యంలో వైరల్ వ్యాధులు మరింత పెరిగే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. జలుబు, జ్వరం, దగ్గు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అస్తమా, సీవోపీడీ వంటి సమస్యలతో బాధపడేవారు మరిన్ని జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి తీవ్రత పెరుగుతున్న క్రమంలో వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు పేర్కొంటున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు జబ్బుల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయని వైద్యులు తెలుపుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

మూడు పూటల వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని చెబుతున్నారు. చలికాలంలో ఆహారం, నీటితో అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదముందని, అందుకే కాచి చల్లార్చిన గోరువెచ్చని నీటిని తాగాలని సూచిస్తున్నారు. పొగమంచు కారణంగా శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ఎండ వచ్చాకే వాకింగ్ చేయడం మంచిదంటున్నారు. చలి తీవ్రత ఎక్కువైనందున పిల్లలు, పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ చలితో చర్మం, ఊపిరితిత్తుల సమస్యలతోపాటు గుండె సంబంధ వ్యాధుల వారికి డిప్రెషన్ పెరిగే అవకాశముందని తెలుపుతున్నారు. శీతకాలంలో ఊపిరితిత్తుల సమస్యలు వస్తే న్యూమోనియా, ఇన్‌ఫ్లూంజాగా పరిగణిస్తారు.

వేడి వేడి ఆహారం తీసుకోవాలి



చలి తీవ్రత బాగా ఉన్నందున పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి. వేడి ఆహారాన్నే తీసుకోవాలి. అస్తమా పేషెంట్లు జాగ్రత్తగా ఉండాలి. ఉదయం 10 గంటల వరకు బయటకు రాకూడదు. కూల్‌డ్రింగ్స్, ఐస్‌క్రీంలు, ఆల్కాహాల్‌కు దూరంగా ఉండాలి. మాంసాహారం ఎక్కువ తీసుకోవచ్చు. రూమ్ హీటర్స్ వాడాలి. బయటకు వెళ్లేప్పుడు ఉన్ని దుస్తులు ధరించాలి.

దుర్గం వెంకటేశ్, ఫిజిషియన్, ఎంజీఎం ఆస్పత్రి

చర్మ వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి



చర్మ వ్యాధిగ్రస్తులు చలికాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. సన్‌స్క్రీన్ లోషన్లు వాడాలి. చలికాలంలో చర్మం పొడిబారుతుంది. ఈ లోషన్‌తో సమస్యల పరిష్కారమవుతుంది. స్నానానికి ఒక బకెట్ గోరువెచ్చని నీటిని వాడాలి. దీనివల్ల చర్మం కాంతివంతంగా ఉంటుంది. పెదవులకు లిప్‌బామ్‌లు వాడాలి. ఎక్కువగా విటమిన్ సీ, ఈ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలి. రోజువారిగా డీ హైడ్రేషన్‌కు గురికాకుండా కనీసం మూడు లీటర్ల నీటిని తీసుకోవాలి. స్వెట్టర్, ఉన్ని దుస్తులు ధరించాలి.

సాతు శ్రీకాంత్, చర్మ వైద్య నిపుణుడు, కాకాజీ కాలనీ

పురుగుల అన్నం పెడుతున్నారు..

» కల్వల ఆదర్శ పాఠశాల విద్యార్థినుల ఆరోపణ » వసతిగృహం వద్ద బైఠాయింపు



ఆదర్శ వసతిగృహం ఎదుట బైఠాయించిన విద్యార్థినులు

కేసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహంలో గురువారం పురుగులు ఉన్న కిచిడీ పెట్టడంతో విద్యార్థినులు వసతిగృహం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ హాస్టల్‌లో కేర్ టేకర్, వంట మనుషుల మధ్య సమన్వయం లేక సరైన సమయానికి అల్పాహారం, భోజనం వడ్డించడం లేదని తెలిపారు. ఉదయం 9 గంటలకే పాఠశాలకు వెళ్లాల్సి ఉండగా 9.30కు అల్పాహారం తయారు చేస్తున్నారని దీంతో తాము టిఫిన్ చేయకుండానే స్కూల్‌కు వెళ్తున్నామని తెలిపారు. భోజనంలో పురుగులు, వంట సామగ్రిలో తుట్టెలు కట్టాయని తెలిపారు. వంట చేసే వారు సాయంత్రం 4 గంటలకే రాత్రి భోజనం వండి ఇంటికి వెళ్లిపోతున్నారని, ఆ తర్వాత రాత్రి 8 గంటలకు నైట్ వాచ్‌మన్ వస్తున్నారని తెలిపారు. అప్పటి వరకు తాము బిక్కుబిక్కుమంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హాస్టల్‌లో వంద మంది విద్యార్థినులు ఉండాల్సి ఉండగా నిర్వాహకుల పనితీరు సరిగా లేకపోవడంతో ప్రస్తుతం 40 మందే ఉన్నారు. బుధవారం తహసీల్దార్ వివేక్ హాస్టల్‌ను సందర్శించి నిర్వాహకులను తొలగిస్తున్నట్లు తెలిపారు. అయితే గురువారం మళ్లీ వారే వచ్చి నాణ్యతలేని అల్పాహారం వండినట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు. కలెక్టర్ తమ హాస్టల్‌కు వచ్చి సమస్యలను పరిష్కరించాలని లిఖితపూర్వకంగా విద్యార్థినులు కోరడం గమనార్హం. ఇప్పటికైనా హాస్టల్‌లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

'ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ కేసులు పెరుగుతున్నాయి'

నెహ్రూసెంటర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ కేసులు పెరుగుతున్నాయని డీఎంహెచ్‌వో భూక్య రవిరాథోడ్ తెలిపారు. ప్రసవాలకు వచ్చే గర్భిణీలను శస్త్రచికిత్స ద్వారా అత్యధికంగా కాన్పులు చేస్తున్నారని, వాటి సంఖ్యను జిల్లాలో అత్యధికంగా గుర్తించామన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లక్ష్మీనర్సింగ్ హోమ్, జీవనజ్యోతి ఆస్పత్రి, ఆయూష్, ఆరోగ్య ఆస్పత్రులను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమన్యాలు సిజేరియన్ చేసే సందర్భంలో పేషెంట్‌ల పరిస్థితులను ఎప్పటికప్పుడు వైద్యశాఖకు తెలియజేయాలని, నిబంధనలకు లోబడి ఆస్పత్రులను కొనసాగించాలన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ శశి, జ్యోత్స్న, సారంగం, ప్రత్యూష, కొప్పు ప్రసాద్, రాజు, లోక్య, అనిల్ పాల్గొన్నారు.

మావోయిస్టుల హత్యలపై విచారణ చేపట్టాలి

● మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి



గూడూరులో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టుల ప్రభుత్వ హత్యలపై వెంటనే సమగ్ర న్యాయ విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వందేళ్ల ముగింపు ఉత్సవాల సం దర్భంగా చేపట్టిన బస్సుజాత గురువారం గూడూరుకు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ మనుషులను చంపినంత మాత్రన సిద్ధాంతాలు, భావాలను చం పడం సాధ్యం కాదనే విషయం మానవ చరిత్ర చెబుతుందన్నారు. మావోయిస్టులను చంపితేనే అటవీప్రాంతాల్లో ఉన్న ఖనిజాల విషయాన్ని ఎవరూ అడిగేవారు ఉండబోరని కేంద్రం భావిస్తోందని పేర్కొన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో ఈనెల 26న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సభకు కమ్యూనిస్టులు, మేధావులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలు మహోత్తరంగా సాగిన జాతీయోద్యమంలో పాల్గొనలేదని, కార్మిక, కర్షక, పేద ప్రజల సమస్యలను సైతం ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కళావేన శంకర్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రెహమాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గూడూరు మండల బాధ్యులు మాలోతు రవీందర్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యంగా పని చేయాలి : డీజీపీ

మహబూబాబాద్ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణతో పాటు, కేసుల దర్యాప్తు పురోగతిని మెరుగుపరిచి, ప్రజల భద్రత, సైబర్ నేరాలను క్షేత్రస్థాయిలో అరికట్టేందుకు పోలీసు యంత్రాం గం పని చేయాలని డీజీపీ శివధర్‌రెడ్డి సూచించారు. 2025 జనవరి మాసం నుంచి సెప్టెంబరు వరకు జరిగిన నేర పరిణామాలపై అన్ని జిల్లాల పోలీసు అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఎ , మహబూబాబాద్ జిల్లాకు సంబంధించిన జిల్లా నేర దోరణులు, పెండింగ్ కేసులస్థితి, ముఖ్య విచారణల పురోగతి, నేర నియంత్రణకు అమలు చేస్తున్న ప్రత్యేక చర్యల వివరాలను డీజీపీకి సమర్పించారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగు పరచాలని, ప్రజలకు స్పీడీ జస్టిస్ అందించేలా పోలీస్ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత, నేర నియంత్రణలో రాజీలేనం తనంతో పని చేస్తూ జిల్లాలో ఎలాంటి నేరాలకు అవకాశం ఇవ్వకుండా క్రమశిక్షణాత్మక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వెర్టికల్ డీఎస్పీ మోహన్, డీసీఆర్బీ సీఐ ఉపేందర్ పాల్గొన్నారు.

ఆదివాసీలపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గంగారం మండలం పోడు రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్‌సెంటర్‌లో గురువారం బాధిత రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. 2018లో గంగారం మండలంలోని ఆదివాసీ రైతులపై అటవిశాఖ అధికారులు అక్రమంగా పెట్టిన కేసులతో రైతులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. పూన్యం ప్రభాకర్, జగ్గన్న, వీరస్వామి, సతీష్, రవి, నర్సయ్య, సమ్మక్క, వెంకటమ్మ, మణెమ్మ, సారక్క ఉన్నారు.

రైతులకు పరిహారం అందించడంలో విఫలం

● తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్


తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌తో కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగానికి పరిహారం అందించడంలో పాలకులు విఫలమయ్యారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ విమర్శించారు. మహబూబాబాద్‌లో గురువారం రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని గునిగంటి రాజన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, సీఐటీయూ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత కిసాన్‌సభ భాగస్వామ్యంతో ఈనెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ఆందోళనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకన్న, నల్లపు సుధాకర్, పాపారావు, రాజారావు, వెంకట్‌రెడ్డి, మధు, రమేష్, తిరుపతిరావు, లక్ష్మి, యాకూబ్‌రెడ్డి జలంధర్, జోగ్యానాయక్ పాల్గొన్నారు.

జువైనైల్ జస్టిస్ బోర్డు ప్రారంభం

మహబూబాబాద్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మానుకోటలోని బాలరక్ష భవన్‌లో జువైనైల్ జస్టిస్ బోర్డును గురువారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రఫీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు కన్నా తక్కువగా ఉన్న బాలలు ఏదేని నేరం చేసినట్లైయితే వాటిని సాధారణ కోర్టులో కాకుండా జువైనైల్ జస్టిస్ బోర్డు ద్వారా విచారణ జరిపిస్తామని చెప్పారు. గతంలో బాలలు నేరానికి పాల్పడితే వరంగల్ జువైనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరు పరిచే వారని, ఇప్పటి నుంచి మహబూబాబాద్ బాలరక్షక భవన్‌లోని జువైనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ బోర్డు పరిధిలో 66 కేసులు ఉన్నాయని, ప్రతీ గురువారం మహబూబాబాద్ జిల్లా కోర్టు అదనపు జ్యూడిషియల్ జడ్జి కృష్ణతేజ్ ఆధ్వర్యంలో ఈ కేసుల విచారణ జరుగుతుందన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిమురారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సబిత, సీడబ్ల్యూసీ జిల్లా ఛైర్‌పర్సన్ నాగవాణి, జేజేబీ మెంబర్ లలిత, సూపరింటెండెంట్లు సంతోష్‌కుమార్, అమరేందర్, న్యాయవాది దాసరి నాగేశ్వర్‌రావు, రాజ్‌కృష్ణ, రాజ్యలక్ష్మి, కమలాకర్, డేవిడ్, వీరన్నపాల్గొన్నారు.


జువైనైల్ జస్టీస్ బోర్డును ప్రారంభిస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రఫీ


సమావేశంలో మాట్లాడుతున్న కవిత

24న నిరసన ప్రదర్శనను సక్సెస్ చేయండి

● టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కవిత

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 24న జిల్లా కేంద్రంలో తలపెట్టిన నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత పిలుపునిచ్చారు. మహబూబాబాద్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టి పండిట్లు, పీఈటీ పోస్టులను అప్‌డేట్ చేయాలన్నారు. గత సంవత్సరం సీఆర్టీలు చేసిన సమ్మె సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శనకు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. బలాష్టి రమేష్, చుంచు శ్రీశైలం, రాచకొండ ఉపేందర్, విష్ణువర్ధన్, రామలింగారెడ్డి, గునిగంటి శ్రీను, సరిరాం, రఫీక్, నరేష్, ధనుంజయ్‌నాయడు, మంగీలాల్, రవి పాల్గొన్నారు.

'కులాంతర వివాహ రక్షణ చట్టాన్ని తేవాలి'


అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న కేవీపీఎస్ నేతలు

మహబూబాబాద్‌టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కుల దురహంకార హత్యలు పెరిగిపోతున్నాయని అందుకోసం కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రక్షణ కల్పించేందుకు కులాంతర వివాహ రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ అంబేద్కర్ విగ్రహం ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో కులదురహంకార హత్యను ఖండిస్తూ గురువారం ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొయినాబాద్ షాద్‌నగర్ పోలీసుల నిర్లక్ష్యంతో ఉన్మాదులుగా వ్యవహరించిన కొందరు వ్యక్తులు కులాంతర వివాహం చేసుకున్న దళిత యువకుడు ఎర్ర రాజశేఖర్‌ను హత్య చేశారని ఈ ఘటనపై తక్షణమే సిట్టింగ్ జడ్జిచే న్యాయవిచారణ జరిపించి నిందితులను శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునారవృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. జిల్లా అధ్యక్షుడు చీపిరి యాకయ్య, మందుల మహేందర్, సురేంద్రనాథ్, అల్వాల ఆనంద్, బేతమల్ల వెంకటాద్రి, చేపూరి గణేష్, నాగరాజు, వెంకన్న, నర్సింహారావు, యాకన్న, అనిల్ పాల్గొన్నారు.

పల్లెల్లో పొలిటికల్ హీట్

(5వ పేజీ తరువాయి)

డోర్నకల్ ఉండగా, రెండేసి మండలాల ప్రాతినిధ్యంతో పాలకుర్తి, ఇల్లందు, ములుగు నియోజకవర్గాలు ఉన్నాయి. దీంతో ఐదుగురు ఎమ్మెల్యేల ఆశీస్సులకు తోడు ఎంపీ మద్దతు కూడా కూడగట్టుకునే పనిలో ఆయా నియోజకవర్గాల పరిధి సర్పంచ్ ఆశావహులు ఉన్నారు. సర్పంచ్ అభ్యర్థులకు మద్దతునిచ్చే వార్డు కౌన్సిలర్ల ఎంపిక కూడా ఎక్కడికక్కడే గ్రామాల్లో కొనసాగుతోంది. ప్రధాన ప్రతిపక్షానికి తోడు బీజేపీ, సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) పార్టీలకు చెందిన ఆశావహులు కూడా తమ ఆధిపత్యాన్ని నిరూపించుకునేందుకు రంగంలో దిగడానికి సిద్ధమవుతున్నారు.

నేడు చెకుముకి సంబురాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో శుక్రవారం మండలస్థాయి చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి శ్రీనివాస్ గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని గీతాంజలి హైస్కూల్‌లో మానుకోట మండలస్థాయి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఇటీవల పాఠశాలస్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు మండలస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఈ పోటీల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంల నుంచి మొత్తం నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ


యాచకులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో మాలాధారణ గావించిన పట్టణానికి చెందిన రిటైర్డ్ సీఐ అంబటి రవీందర్ గురువారం యాచకులకు చలి దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని వివిధ దేవాలయాల వద్ద వందమంది యాచకులకు చలి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ చలి తీవ్రత పెరగడంతో యాచకులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వారికి దుప్పట్లు అందించినట్లు చెప్పారు. శివ మాలాధారణ గావించిన ఇస్లావత్ రాజేశ్వరి పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు కేసముద్రం విద్యార్థులు

కేసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నల్గొండలో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు కేసముద్రం శ్రీవివేకవర్ధిని విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ గురువారం తెలిపారు. నెల్లికుదురులో ఇటీవలె నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభకనబర్చి గద్దల సాత్విక్ హర్ష, రేసు చరణ్, గుగులోత్ ఐశ్వర్య, కందునూరి విరోనిక, బానోత్ హాసిని, జాటోత్ రాజేశ్వరి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ డెక్క లక్ష్మణ్, విద్యార్థులను అభినందించారు.

తొమ్మిదో తరగతి విద్యార్థి అదృశ్యం

మహబూబాబాద్‌క్రైం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తప్పిపోయినట్లు మానుకోట టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. బాపనపల్లి బుచ్చిబాబు-సునీత దంపతులతో పాటు ఇద్దరు కుమారులు పట్టణంలోని సున్నా నారాయణ కాలనీలో కొంత కాలంగా నివాసం ఉంటున్నారు. పెద్దకుమారుడు మానుకోటలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండో కుమారుడు బాపనపల్లి తరుణ్ వరంగల్ ఒగులాపూర్‌లోని ఓ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యాభ్యాసం చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 15న పాఠశాల నుంచి మహబూబాబాద్‌లోని ఇంటికి వచ్చాడు. 19న ఇంటి దగ్గర నుంచి పాఠశాలకు వెళ్తున్నానని ఆటోలో రైల్వేస్టేషన్‌కు బయలు దేరాడు. పాఠశాలకు వెళ్లలేదని, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించనట్లు తెలిపారు. తల్లి సునీత, తండ్రి బుచ్చిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

23న క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 23న తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అనుబంధ మహబూబాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ గోల్డ్‌కప్ 2025 టీ-20 జిల్లాక్రికెట్ జట్టు ఎంపికలను నిర్వహిస్తున్నట్లుఅసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా రాంచంద్రారెడ్డి, దేశబోయిన శ్రీనివాస్ తెలిపారు. మహబూబాబాద్‌లో గురువారం నిర్వహించిన క్రికెట్ అసోసియేషన్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఓపెన్ టూ ఆల్ పద్ధతిలో ఎంపికలు నిర్వహిస్తామని, ఎంపికైన జిల్లా జట్టు ఈనెల చివరలో జరిగే ఈస్ట్‌జోన్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. ఎంపికలో పాల్గొనే క్రికెట్ క్రీడాకారులు యూనిఫామ్‌తో పాటు క్రికెట్ కిట్టు తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. అదే విధంగా డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్ (వయసు ధ్రువీకరణ పత్రం) ఆధార్ కార్డు లేదా పదో తరగతి మెమో వెంట తెచ్చుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ :90325 59472, 88977 32727, 95737 05028లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ జాకీర్ హుస్సేన్, ఎస్కే.గౌస్, ఈసం నగేష్, సయ్యద్ జమీర్, ఎమ్డీ. ఖాజా పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిపో కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ మానుకోట డిపో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబాబాద్‌లో గురువారం ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సమావేశమై వరంగల్ రీజీయన్ కార్యదర్శి కొత్త నాగయ్య సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.సుధాకర్‌నాయక్, కార్యదర్శిగా బిర్రు ఐలయ్య, కోశాధికారిగా పి.సురేందర్ ఎన్నికయ్యారు.

కల్వల ఉన్నత పాఠశాలలో స్వయంపాలన

కేసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు బండారు నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్ఎంగా పెద్దారపు యూహిత, డీఈవోగా అజ్మీర పృథ్వీ, ఎంఈవోగా బానోత్ సింధు, 22 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాచకొండ యాకాంబ్రం, బి.సత్యనారాయణ, తండ సదానందం, వి.నాగేందర్, ఆర్.భిక్షపతి, పీడీ కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీది త్యాగాల చరిత్ర

(5వ పేజీ తరువాయి)

చేరుకుంది. ఈ సందర్భంగా నెహ్రూసెంటర్‌లో జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వామపక్ష ప్రగతిశీల శక్తులు ఎర్రజెండాలన్ని ఏకతాటిపైకి వచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు శంకర్, రాష్ట్ర నేతలు అనిల్‌కుమార్, మణికంఠారెడ్డి, రమేష్, లక్ష్మీనారాయణ, రెహమాన్, జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సహాయ కార్యదర్శి అజయ్‌సారథిరెడ్డి, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, వెంకన్న, సాంబలక్ష్మి, ఫాతిమా, చిదిరాల జ్ఞానేశ్వర్, పాండురంగాచారి, వరిపెల్లి వెంకన్న, నక్క నాగార్జున, వెలుగు శ్రావణ్ పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

● మెడికల్ ఆఫీసర్ మౌనిక

నెహ్రూసెంటర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కుష్టువ్యాధి నిర్మూలన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా కేంద్రంలోని హన్మంతరావునగర్ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలో కుష్టురహిత సమాజ నిర్మాణం కోసం ఎల్‌సీడీసీ, లెప్రసి, డిటెక్షన్, క్యాంపులు నిర్వహించాలన్నారు. కుష్టువ్యాధిని తొలి దశలోనే గుర్తించి సంపూర్ణ చికిత్స తీసుకుంటే ఆదిలోనే నయం చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో సుజాత, సుష్మ, పాల్గొన్నారు.


ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న మౌనిక


ఏఐసీఎఫ్ శిక్షణలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు విజయరాజు

'యువత రాజకీయాల్లోకి రావాలి'

మహబూబాబాద్ టౌన్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : దేశ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని దళిత, క్రైస్తవ యువకులు రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాలని ఆల్‌ఇండియా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగం జాతీయ కోఆర్డినేటర్, ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు సూచించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఏసు క్రీస్తు ప్రార్థనమందిరంలోఆల్ ఇండియా క్రిస్టియన్ ఫేడరేషన్ (ఏఐసీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం దళిత, క్రైస్తవ యువకులకు నాయకత్వంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ దళిత, క్రైస్తవులకు అన్ని రాజకీయ పార్టీలు అవకాశాలు కల్పించాలని కోరారు. దళిత క్రైస్తవుల హక్కుల సాధనకు త్వరలో నిర్వహించబోయే ఒక మిలియన్ గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదిక ఆధారంగా దళిత, క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలలిఖన కేంద్రప్రభుత్వం జస్టిస్ కేజీ, బాలకృష్ణన్ కమిటీని వేసి కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. దళిత, క్రైస్తవులపై దాడులను అరికట్టాల్సిన బాధ్యత కేంద్రానిదేనని చెప్పారు.

మునిగలవీడు సమస్యలు పరిష్కరించాలి

నెల్లికుదురు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మునిగలవీడు గ్రామసమస్యలను పరిష్కరించలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ దళితులకు నిర్మించిన శ్మశానవాటిక నిధులు మంజూరు చేయాలన్నారు. బోరు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, వేణు, వెంకన్న, ఐలయ్య, యాకయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

'భిక్షం మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు'

నెల్లికుదురు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : మునిగలవీడు మాజీ సర్పంచ్ ఇసంపెల్లి భిక్షం మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని మునిగలవీడులో భిక్షం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే మురళీనాయక్ పూల మాలవేసి, నివాళులు అర్పించారు. భిక్షం కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు గొల్లపెల్లి ప్రభాకర్ గౌడ్, పట్నంశెట్టి నాగరాజు, తుప్పతూరి రాజు, ఇసంపెల్లి వెంకటేష్, ఉపేందర్, బాలాజీనాయక్, జెల్ల వెంకటేష్, మాదరి ప్రశాంత్ పాల్గొన్నారు.

వృద్ధురాలిని హత్య చేసిన వారిని శిక్షించాలి

నెల్లికుదురు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామన్నగూడెంలో వృద్ధురాలు కల్లెపు పద్మను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ గ్రామస్థులు మహిళ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం గ్రామప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళ సంఘం సభ్యులు గాండ్ల విజయ, బండి మంజుల మాట్లాడారు. ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలును ఇంట్లో అమానుషంగా హత్య చేయడం విచారకరమన్నారు. గ్రామంలో మహిళలు భయాందోళను గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హత్యచేసిన వారిని త్వరగా పట్టుకొని శిక్షించాలన్నారు. నిందితులను గ్రామం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థులు గాండ్ల కవిత, అవారి రమణ, పాశం రాణి, పాశం శ్రీలత, కొయ్యేడి ఉపేంద్ర, సరిత, అరుణ పాల్గొన్నారు.


రామన్నగూడెంలో ధర్నా చేస్తున్న మహిళ సంఘం సభ్యులు